కథా నిలయం
శ్రీకాకుళం

# సుజిత

భలె మంచిరోజు... పసందైన రోజు... వసంతాలు పూచేనేటిరోజు..... ఎందుకీ రోజు ఈ పాటే బుర్రలో గిర్రున తిరుగుతోంది? ఈరోజు పక్కమీంచి లేస్తుండగానే ఎక్కడ్నించో గాలిలో అలలు అలలుగా తేలిపోతూ ఈ పాట తన చెవుల్లో ప్రవేశించింది... అప్పట్నించి యేపని చేస్తున్నా ఇదే పాట బుర్రలో గింగురుమంటోంది.

ఈరోజేదో మంచి జరగబోతున్నదని ఈ పాట సూచిస్తోందా? విష్‌ఫుల్ థింకింగ్.... యేదో అద్భుతం జరగాలన్న ఆశ, ఎవరో ఎక్కడ్నించో తన కోసం యేదో గొప్ప మేలు చేస్తున్నారన్న ఆశ, ఎవరో తన కోసం ఆకాశంలోంచి ఊడిపడ్తారన్న ఊహ, పైకెగిరిపోవాలన్న కోరిక.... పైకి...పైకి .... ఇంకా పైకి... ఎవరికీ అందనంత పైకి, ఆకాశమే హద్దుగా పైకెళ్ళిపోవాలి... ఎంత పైకెళ్ళినా మళ్ళీ కిందకురాక తప్పదుకదా..... పక్కమీంచి కిందకు దిగాలి.... తప్పదు.....టూత్ పేస్ట్ బ్రష్ మీద వేసుకొని పళ్ళుతోముకోవాలి..... మొఖం మీదనీళ్ళు కుమ్మరించుకొని మొఖం కడుక్కోవాలి.... అప్పుడు గాని ఈ నిద్ర మత్తు వదలదు. తర్వాత పేపర్‌బోయ్ పడేసిపోయిన పేపర్ తిరగెయ్యాలి. పేపర్ చదువుతూ టిఫిన్ చెయ్యాలి.... ఈ రొటిన్ తప్పదు..... ఇవన్నీ రోజు చేసే పనులే... ఇవేవీ చెయ్యకుండా బతకలేమా? ఇవేవీ చెయ్యకుండా రోజంతా బెడ్ మీదే వెచ్చగా కలలుగంటూ పడుకుంటే ఎంతహాయిగా ఉంటుందో..... ఒక్కడే పడుకుంటే యేం హాయిలే.... పక్కన సారిక లేదుగా? ఏమైపోయిందీ..... సారిక? తన శరీరంతో తన శరీరాన్ని పెనవేసి తనను ఉత్కృష్ట ప్రపంచంలోకి తీసికెళ్ళిన సారిక, తన గుండెల్లో కోరికల్ని మండించిన సారిక, తన రక్త మాంసాల్ని పీల్చి పిప్పి చేసిన సారిక, మట్టి ముద్దలాంటి తనను మాణిక్యంగా మలిచిన సారిక, పురూరవుడిలాంటి తన కోసం దివినుండి భువికి దిగి వచ్చిన ఊర్వశి, సారిక. పురూరవుడ్ని వదిలేసి యే అనంత లోకాలకో వెళ్ళి పోయిన ఊర్వశిలాగే సారిక కూడా తనను విడిచి వెళ్ళిపోయింది. ఈ లోకంలోంచి ఎక్కడికో మరో లోకంలోకి, మరో ప్రపంచంలోకి ఎగిరిపోయిన సారిక మళ్ళీ వస్తానంది – కానీ నిజంగా వస్తుందా? తన కోసం అనుక్షణం ఎదురుచూస్తున్న ఈదీనుడికోసం వస్తుందా? అగ్నిలా కాల్చేస్తున్న ఈ విరహవేదనకు ముగింపు పలుకుతుందా? రోజులు గడిచిపోయాయి.... సంవత్సరాలు గడిచిపోయాయి.... యుగాలు

గడిచిపోయాయి... పురూరవుడు ఎదురుచూస్తూనే ఉన్నాడు. విరహాగ్నిలో కాలిపోతూనే ఉన్నాడు. కానీ ఊర్వశి రాలేదు.... సారిక కూడా రాదు..... విరహాగ్నిలో తనను తాను దహిచుకుంటూనే ఉన్నాడు. తన శరీరంలోని ప్రతీ అణువు క్రమ క్రమంగా ఆ అగ్నికి ఆహుతైపోతూనే ఉంది. అయినా సారిక రాలేదు. వస్తుందన్న ఆశ తనను వీడటంలేదు.

"ఇది చాలా గొప్ప అవకాశం. దీన్ని నేను వదులుకోలేను.... ప్లీజ్ ట్రైటు అండర్‌స్టాండ్ మీ వివేక్!"

"నో క్వశ్చన్ ఆఫ్ అండర్‌స్టాండింగ్.... నువ్వు వెళ్ళడానికి నేనొప్పుకోను. దట్సాల్".

"మూర్ఖంగా మాట్లాడకు వివేక్....."

"మూర్ఖంగా మాట్లాడుతున్నది నువ్వు..... నేనుకాదు"

"ప్రతి మూర్ఖుడు నేను మూర్ఖున్ని కానని మూర్ఖంగా వాదిస్తూనే ఉంటాడు. నువ్వు దానికి మినహాయింపు కాదు."

"ఓ.కె. నేను మూర్ఖుణ్ణే- నీ విషయంలో మూర్ఖుణ్ణే.... మూర్ఖుడు రాజుకంటే బలవంతుడంటారు. నేను బలవంతునిగా మారాలంటే మూర్ఖుడుగా మారాలి- మూర్ఖుడిగా మారగల్గితేనే నిన్ను ఆపగల్గుతాను"

"నన్నెవరూ ఆపలేరు వివేక్! అయామే ఏ ఫ్రీ ఇండివిడ్యువల్...... ఎవరికోసం కూడా నా స్వేచ్ఛను వదులుకోనడానికి నేను సిద్ధంగా లేను"

"నా కోసం కూడా....."

"నీ కోసం కూడా...."

"మన ప్రేమకోసంకూడా"

"నిన్ను ప్రేమించిన మాట నిజమే .... కానీ నిన్ను ప్రేమించడం వల్ల నేను నా స్వేచ్ఛను వదులుకోలేనని నీకెన్నో సార్లు చెప్పాను.... నాకు ప్రేమెంత ముఖ్యమొ స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యం.... ఎవరైనా నన్ను ప్రేమ, స్వేచ్ఛ.... ఈ రెండింటిలో దేనికి ఫస్ట్ ప్రిఫరెన్స్ ఇస్తావని అడిగితే స్వేచ్ఛకేనని చెబుతాను."

"అంటే నువ్వు నిజంగా ఎవర్నీ ప్రేమించలేవన్నమాట.... ప్రేమించటమంటే ప్రేమించిన వ్యక్తికి మనల్ని పూర్తిగా అర్పించుకోవటం... స్వేచ్ఛతో సహా మన సర్వస్వాన్ని ఆ వ్యక్తికి ధారపోయటం".

"స్వేచ్ఛ ధార పోయటం అనేది ఉండదు, స్వేచ్ఛను ధార పోసిన వ్యక్తి వ్యక్తిగా మిగలడు... వ్యక్తిగా అంతమైపోతాడు"

"ప్రేమించినవాడు కూడా వ్యక్తిగా అంతమైపోతాడు."

"ఎలా ?"

"ప్రేమించిన వ్యక్తితో కలిసిపోవడం ద్వారా ఇద్దరు వ్యక్తులు ఒకరుగా ఐక్యమైపోవడమే ప్రేమంటే.... ప్రేమించాక నువ్వు నువ్వుగా ఉండవు. నేను నేనుగా ఉండను. ఇద్దరం ఒకరుగా మారిపోయి ఒక నూతన వ్యక్తిగా ఆవిర్భవిస్తాం"

"నాన్‌సెన్స్.... అబ్‌సల్యూట్ నాన్‌సెన్స్... నేను నేనుగా అంతమైపోవడం, నువ్వు నువ్వుగా అంతమైపోవడం, ఇద్దరం ఒకరుగా ఆవిర్భవించడం - ఇది వినడానికి బాగానే ఉంటుంది. - ఒక ఆదర్శంగా, ఒక మధురస్వప్నంగా బాగానే ఉంటుంది. కానీ అదెప్పటికీ సాధ్యమయ్యే పనికాదు. బతికున్నంతకాలం నువ్వు, నేను వేరు వేరు శరీరాలుగానే ఉండిపోతాం తప్ప ఒకరుగా మారిపోవడం అసంభవం."

"మనం భౌతికంగా ఒక శరీరంగా మారకపోవచ్చు, కానీ మన ఆత్మలు ఒకటైపోతాయి.... మన కలలు, కన్నీళ్ళు ఒకటైపోతాయి"

"ఇది కూడా వినటానికి మాత్రమే బావుంటుంది. ఊహించుకోవడానికి కూడా బాగానే ఉంటుంది. శరీరాలు వేరైనా ఆత్మలు ఒకటికావడం, మనసులు ఒకటికావడం, ఇదంతా కవులు సృష్టించిన అవాస్తవిక ప్రపంచం. అసలు ఆత్మలంటే యేమిటి? శరీరానికతీతమైన ఆత్మ అనేదొకటుందని నేననుకోను .... మనసు ఉన్నదంటే ఒప్పుకుంటాను. కానీ మనసు కూడా శరీరంలోని భాగమేనని నా అభిప్రాయం.... ఈ ఆత్మ, ఈ మనసు, ఈ శరీరం ... ఇవన్నీ వేర్వేరుకావు.... అన్నీ శరీరంలోని బాగాలే. మన సోకాల్డ్ ఆత్మ లేక మనస్సు మన ఫ్లెష్ అండ్ బ్లడ్‌లోంచి ఉత్పన్నమైనవే.... ఆకలేసినప్పుడు మన మనస్సు ఒకలా ఉంటుంది. కడుపునిండా తిన్నప్పుడు ఒకలా ఉంటుంది. ఇష్టమైన వాళ్ళతో సెక్స్‌లో పాల్గొంటున్నప్పుడొకలా ఉంటుంది. మనస్సనేదొక ప్రవాహం..... ఇప్పుడున్నట్లు మరుక్షణంలో ఉండదు. శరీరంలో కల్గే మార్పులు మనస్సును ప్రభావితం చేస్తాయి. నేను నిన్ను ప్రేమించినంత మాత్రాన నీ మనసు నా మనస్సు పూర్తిగా ఐక్యమైపోయి ఇద్దరి మనస్సులు ఎప్పుడూ ఒకేలా ఆలోచిస్తాయనుకోవడం ఓ పెద్ద అబద్ధం."

" అంటే...ప్రేమే ఓ పెద్ద అబద్ధమంటావా"

"ప్రేమే ఓ పెద్ద అబద్ధం అనడం లేదు. శారీరకంగాను, మానసికంగానూ ఎప్పుడూ కలిసి ఉండాలనుకోవడం .... అలా కల్సి ఉన్నప్పుడు ఆ ఇరువురూ గొప్ప ఆనందాన్ని అనుభవించడం–ఇది నిజమే. ప్రేమలో పొందినంత ఆనందాన్ని మనం మరే విధంగానూ పొందలేమన్నదీ నిజమే. కానీ ప్రేమించుకున్న ఆ ఇద్దరూ ఇద్దరు వ్యక్తులుగా అంతమైపోయి ఒక వ్యక్తిగా మారిపోతారన్నది మాత్రం గొప్ప అబద్ధం..... రొమాంటిస్టులు ఈ అబద్ధాన్ని సృష్టించారు. నిన్ను ప్రేమించినంత మాత్రాన వ్యక్తిగా నేను అంతరించిపోతాననడం పూర్తిగా నన్ను నీకు అర్పించుకొని నా సర్వస్వాన్ని కోల్పోతాననడం–బ్లంట్‌గా చెప్పాలంటే నేను నీకో బానిసగా మారిపోతాననడం, నాన్‌సెన్స్... అలాగే నువ్వు కూడా వ్యక్తిగా అంతమైపోయి నాకు బానిసగా మారిపోయాననుకోవడం నిన్ను నువ్వు మోసగించుకోవడమే. ఎవరు ఎవరికీ బానిసలుగా మారిపోకూడదు–నీ వ్యక్తిత్వాన్ని నువ్వు, నా వ్యక్తిత్వాన్ని నేనూ కాపాడుకోవాలి. అలాగే నా స్వేచ్ఛను నేను, నీ స్వేచ్ఛను నువ్వు కాపాడుకోవాలి."

"నువ్వు చెప్పేదేమిటో నాకర్థం కావడం లేదు... నువ్వు నాదానివి.... నేను నీవాడిని.. నీ మీద నాకూ, నామీద నీకూ సర్వహక్కులున్నాయన్నంత వరకే నాకు తెలుసు... నిన్ను వదిలి నేను ఒక్కక్షణం కూడా ఉండలేనని నాలోని ప్రతి అణువూ ఘోషిస్తున్నది..... అందుకే నిన్ను అమెరికాకు వెళ్ళొద్దంటున్నాను. నీతో ఎడబాటును ఒక్క క్షణం కూడా భరించలేని నేను ఓ యేడాది పాటు ఎలా భరించగలననుకుంటున్నావు? ఐవిల్ సింప్లీ డై.... నువ్వు తిరిగొచ్చేటప్పటికి నేనీ ప్రపంచంలో ఉండను సారికా! విరహాగ్నిలో కాలి క్రుంగి, కృశించి, నశించిపోతాను"

" ఈ పొజెసివ్‌నెస్సే వద్దన్నది ..... ఈ పొయెటిక్ నాన్‌సెన్సే వద్దన్నది. నువ్వు నన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఎందుకుండలేవో నాకు తెలుసు.... నీకు నా శరీరం కావాలి.... నాశరీరం ద్వారా లభించే సుఖం కావాలి... శారీరక సుఖానికతీతమైన ప్రేమను నువ్వూహించలేకపోతున్నావు...."

" అంటే... అంటే... ప్రేమలో సెక్స్‌కు స్థానం లేదంటావా? "

"ప్రేమలో సెక్స్‌కు స్థానం లేదనడం లేదు. కానీ సెక్స్ మాత్రమే ప్రేమ కాదంటున్నాను.. నువ్వు ఇండియాలో ఉంటూ, నేను అమెరికాలో ఉంటూ కూడా

మనం ప్రేమించుకోవచ్చు. సెక్స్ తాత్కాలికమైన ఆనందాన్నిస్తుంది. కానీ ప్రేమ శాశ్వతమైన ఆనందానిస్తుంది.."

"ఓ సంవత్సరం వరకు మనిద్దరం శారీరకంగా ఒకర్నొకరం కలుసుకోకపోయినా మన ప్రేమ నిలుస్తుందంటావా?"

"తప్పకుండా నిలుస్తుంది, మనిద్దరి మధ్య ఉన్నది నిజమైన ప్రేమైతే...."

" ఈ సంవత్సరకాలంలో నాలో సెక్స్ కోరికలు కల్గనే కల్గవంటావా?"

"సెక్స్ అనేది పురుషుడికి ఫర్ ఇట్స్ సేక్ కావాలి....."

" అంటే......"

"ప్రేమించిన పురుషుడితో స్త్రీ సంతానంకోసం సెక్స్ కోరుకుంటుంది. సెక్యూరిటి కోసం సెక్స్ అంగీకరిస్తుంది......."

"అంటే?"

" భర్త కోరికల్ని తీరిస్తేనే తనకు రక్షణ ఉంటుందని స్త్రీ చాలా సహజంగా తెలుసుకుంటుంది"

" స్త్రీకి సెక్స్ కోరికలుండవా?"

" ఉంటాయి.... కాని పురుషుడిలా ఆమె అనుక్షణం ఆ కోరికలతో సతమతమైపోదు..... ఎవరో ఒకరు, అంటే అతడు భర్తకావచ్చు..... ప్రియుడు కావచ్చు.... జాగృతం చేస్తే తప్ప స్త్రీలో సెక్స్ కోరికలు వాటంతట అవే జాగృతం కావు..... నూటికి తొంబై మంది స్త్రీలు భర్తల కోరికలు తీర్చడానికే సెక్స్‌లో పాల్గొంటారు తప్ప తమ కోరికల్ని తీర్చుకోవడానికి కాదు"

" నువ్వు కూడా కేవలం నా కోరికను తీర్చడానికే నాతో సెక్స్ లో పాల్గొన్నావా?"

" అవును ...... మొదట్లో అలాగే పాల్గొనేదాన్ని"

"అంటే నా మీద నీ కసలు ప్రేమలేదా? ప్రేమకోసమే నువ్వు నాతో శారీరకంగా కలసావనుకున్నాను. నాతో కలవడం ద్వారా నీకెలాంటి ఆనందం కల్గలేదా?"

" నీకు ఆనందం కల్గిస్తున్నానన్న ఫీలింగ్ వల్ల నాకూ ఆనందం కల్గింది...."

" అంతేనా ? అంతకుమించి ఇంకేమీ లేదా?"

"నీ మీద ప్రేమ ఉంది...... సెక్స్‌తో నిమిత్తం లేని ప్రేముంది... దాన్ని నువ్వు అర్థం చేసుకోలేక పోతున్నావు......"

" కానీ......నాకు నీ మీదున్న ప్రేమ సెక్స్‌కతీతమైన ప్రేమకాదు..... నాకు అనుక్షణం నీతో కలవాలనిపిస్తుంది..... నీ శరీరంతో నా శరీరం ఐక్యమైపోయినప్పుడు కల్గే ఆ ఆనందాన్ని శాశ్వతం చేసుకోవాలనిపిస్తుంది..... మనిద్దరి శరీరాలు ఎప్పుడూ అలాగే ఫ్రీజయిపోతే బావుండుననిపిస్తుంది. నీతో విడిపోయిన మరుక్షణం నుండి మళ్ళీ నీతో కలిసిపోవాలన్న తపన మొదలౌవుతుంది........ నీతో తప్ప మరో స్త్రీతో ఈ కోరికను తీర్చుకోవడాన్ని నేనూహించలేను..... నువ్వే కావాలనిపిస్తుంది. .... ఇదంతా ప్రేమేకాదంటావా?"

" కాదనను..... కానీ పురుషుడి ప్రేమకూ స్త్రీ ప్రేమకు మధ్య ఉండే వ్యత్యాసాన్ని నువ్వు తెలుసుకోవాలంటాను..... స్త్రీది సెక్స్‌కతీతమైన ప్రేమ...... పురుషుడిది సెక్స్‌తో కూడుకున్న ప్రేమ".

"స్త్రీది స్వచ్ఛమైన ప్రేమ ఎలా అవుతుంది. దాంట్లో మాత్రం స్వార్థం లేదా? స్త్రీ సంతానం కోసం, సెక్యూరిటీకోసం ప్రేమిస్తుందని నువ్వే అన్నావుగా".

"ఆ మాట నేను సామాన్య స్త్రీలను గురించి చెప్పాను..... ముఖ్యంగా వివాహితులైన స్త్రీలను గురించి చెప్పిన మాట అది. యేస్వార్థానికి లోను కాకుండా ప్రేమించే స్త్రీలు ఈ ప్రపంచంలో చాలా మందే ఉంటారు."

" అందుకు ఉదాహరణగా నిన్ను చెప్పొచ్చా?"

"వ్యంగ్యమా?"

"కాదు........ నిజమే"

" ఎందుకు నిజమనిపించింది"

"నిన్ను ప్రేమించాను కానీ పెళ్ళి మాత్రం చేసుకోనన్నావు కదా... స్త్రీ పెళ్లి ద్వారా కోరుకునేది సంతానాన్ని, రక్షణను...... ఇవి రెండూ నువ్వు వద్దన్నావు కదా.... అందుకే నీది నిస్వార్థమైన ప్రేమ అన్నాను."

" నేను నిన్ను పెళ్ళి చేసుకోకపోవడానికి మరో కారణం కూడా ఉంది"

" యేమిటో అది"

" స్వేచ్ఛ"

" పెళ్ళి చేసుకుంటే స్వేచ్ఛ పోతుందనా?"

" అవును ..... పెళ్లి చేసుకున్న మరుక్షణం మనం మన స్వేచ్ఛను

కోల్పోతాం..... భర్త మీద భార్యకు, భార్య మీద భర్తకు కొన్ని హక్కులేర్పడతాయి..... భర్త నాకు తప్ప మరెవ్వరికీ చెందకూడదని భార్య, భార్య నాకు తప్ప మరెవ్వరికీ చెందకూడదని భర్త అనుకుంటారు. నేను చెప్పినట్టు భర్త వినాలని భార్య, భార్య వినాలని భర్త కోరుకుంటారు...... దాంతో తమ తమ వ్యక్తిత్వాలనూ, స్వేచ్ఛనూ కాపాడుకోవడం ఎలా సాధ్యమవుతుంది.? పెళ్ళి చేసుకున్న మరుక్షణంలో అటు భార్య, ఇటు భర్త ఫిఫ్టీ పర్సెంట్ ఆఫ్ దెయిర్ ఫ్రీడమ్, కోల్పోతారు."

"పెళ్ళి అనే వ్యవస్థ లేకుండా సమాజంలో సుస్థిరత ఎలా వుంటుంది.? పిల్లలకు రక్షణ ఎలా వుంటుంది.? ఎవరి స్వేచ్ఛను వాళ్ళే కాపాడుకుంటూ ఇష్టమొచ్చినట్టుగా తిరిగితే ఈ సమాజపు గతేం కావాలి?"

"నాలాగా సమాజంలో అందరూ స్వేచ్ఛను కోరుకునే వాళ్ళే వుండరు.... యే సమాజంలోనయినా నాలాంటి వాళ్ళు కొద్ది మందే వుంటారు. ఎక్కువ మంది స్త్రీ పురుషులు పెళ్ళి అనే సమాజం యేర్పరచిన చట్రంలోనే యిమిడిపోతారు. పెళ్ళిళ్ళు చేసుకుని భార్యా భర్తలు ఒకరికొకరు దాస్యం చేసుకుంటూ పిల్లల్ని కంటూ మళ్ళీ ఆ పిల్లలకు దాస్యం చేస్తూ సమాజపు సుస్థిరతను కాపాడుతూ తమ జీవితాలను వెళ్ళదీస్తూంటారు. పెళ్ళిని నూరేళ్ళ పంటగా చిత్రిస్తూ పిల్లల కోసమే పెద్దల జీవితం అంటూ ప్రచారం చేయడం సమాజ సుస్థిరత కోసమే. మెజారిటీ ఆఫ్ ద పీపుల్ ఈ ప్రచారాన్ని నమ్ముతారు. అందుకే పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల్ని కంటూ, సమాజ సుస్థిరతనూ, కొనసాగింపునూ కాపాడుతుంటారు. వీళ్లకు తాము స్వేచ్ఛను కోల్పోతున్నామన్న జ్ఞానమే ఉండదు – సమాజ చట్రంలో యిమిడి పోవడం తప్ప వీళ్ళ జీవితాలకు మరో లక్ష్యం అంటూ వుండనే వుండదు."

"సమాజంలో అందరూ నీలాగే స్వేచ్ఛా జీవులుగా మారిపోయారనుకో... ఎవరూ పెళ్లిళ్ళు చేసుకోలేదనుకో ....... పిల్లల్ని కనలేదనుకో....... అప్పుడు సమాజం గతేంకావాలి? సమాజం ఎలా కొనసాగాలి?"

" నిజంగా అలాంటి స్వేచ్ఛాజీవుల ప్రపంచమే ఈ ప్రపంచంలో స్థాపితమయితే అదెంత అద్భుతంగా వుంటుందో!......... నిజంగా అలాంటి సమాజం యేర్పడడానికి ఎన్నో శతాబ్దాలు పట్టొచ్చు – యే 23 వ శతాబ్దంలోనో, 24 వ శతాబ్ధంలోనో అలాంటి ప్రపంచం యేర్పడిందనుకో...... అప్పుడు ఈ భూమ్మీద మానవజాతి కొనసాగడం కోసం మరో పద్ధతిలో పిల్లల ఉత్పత్తి జరగొచ్చు- మరో రెండు మూడు శతాబ్ధాల తర్వాత ఈ సమాజం ఎలాంటి మార్పులకు గురి అవుతుందో ఇప్పుడే మనం ఎలా చెప్పగలం?"

" టెస్ట్‌ట్యూబుల్లో పుట్టిన పిల్లలకూడా పోషణ భారం తీసుకునే వాళ్ళు ఉండాలి కదా......."

" ఉంటారు.... పిల్లల్ని పెంచి పోషించే బాధ్యతను స్వీకరించే కొన్ని ప్రత్యేక వ్యవస్థలు అప్పటి వరకు స్థాపించబడతాయేమో..... ఇవాళ్ళ ఈ సమాజం ఇట్లా ఉంటుందని .... మనం కనీసం ఓ ఇరవై యేళ్ళ క్రితం ఊహించామా?"

" సరే... అదట్లా ఉండనీయ్. నువ్వు ఇప్పుడు అమెరికా వెళ్ళిపోతానంటావు.... ఎవరికోసం.... చివరకు నాకోసం కూడా నీ స్వేచ్ఛను వదులుకోనంటావు..."

" నాకోసం కూడా అనడంలో నీ అహం, నా మీద నీకుందనుకుంటున్న హక్కు అధికారం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పెళ్ళి కాకుండానే నా మీద నీకెంతో హక్కున్నదన్నట్టుగా ఫీల్ అవుతున్నావు - పెళ్ళే అయితే నా మీద నువ్వెంత అధికారం చెలాయించే వాడివో ఊహిస్తే భయమేస్తున్నది."

" నీ మీద నేనేమి హక్కును ప్రదర్శించడం లేదు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను కాబట్టి నీతో కలిసి వుండాలనుకుంటున్నాను. అందుకే నిన్ను అమెరికా వెళ్ళొద్దంటున్నాను.... అంతే తప్ప దీంట్లో నువ్వూహించుకుంటున్న హక్కు అధికారంలాంటిదేమి లేదు. నీ మీద నాకు ప్రేమా దోమా ఏమీ లేదు.... నన్ను విడిచి వెళ్ళుతున్నందుకు బాధ కూడా ఏమీ లేదనుకుంటే నువ్వు వెళ్ళిపోవచ్చు."

" నీ మీద ప్రేమ లేదనుకోవడం లేదు- నిన్ను విడిచి వెళ్తున్నందుకు బాధ పడటంలేదని అనడంలేదు... నాకు వీటి కంటే వెళ్ళడమే ముఖ్యం అనిపిస్తున్నది... స్వేచ్ఛఅంటే మనకు ఎన్నో ప్రత్యమ్నాయాలు వున్నపుడు ఏది ముఖ్యమో దాన్ని ఎన్నుకోవడం"

" అంటే నేను ముఖ్యం కాదన్నమాట"

" నువ్వూ ముఖ్యమే కాని, నీ కంటే నేను అమెరికా వెళ్ళి రిసెర్చి చేయడం ముఖ్యం. అదీ నాకెంతో ఇష్టమైన విషయం మీద పరిశోధన చేయడం.... ఫోర్డ్ ఫౌండేషన్ వారు నాకు స్కాలర్‌షిప్ ఇస్తున్నారు.... రిసెర్చ్ చేయడానికి కావలసిన సౌకర్యాలన్నీ అమెరికాలో వున్నాయి. కాబట్టి నేనీ అవకాశాన్ని పోగొట్టుకోదల్చుకోలేదు."

" నువ్వు ప్రవాసంనుండి తిరిగొచ్చాక నాతో ఇప్పటిలా కలిసుంటావా?"

" తప్పకుండా... ఓ సంవత్సరం తర్వాత కూడా నా మీద నీకు, నీ మీద నాకు ఈ ప్రేమ ఇలాగే నిలిచివుంటే మనం ఇప్పటిలాగే కలిసి జీవిద్దాం. "

" సంవత్సరం తర్వాత మన ప్రేమ ఇలాగే వుండదేమోనని నీ అనుమానమా?"

" అనుమానమని కాదు.... సంవత్సరం తర్వాత ఏం జరుగుతుందో చెప్పలేం.... మనస్సనేది ఎప్పుడూ స్థిరంగా వుండదు... క్షణక్షణానికి మారుతుంటుంది..అదొక ప్రవాహం.... ఒక స్ట్రీమ్ ... "

" కావచ్చు. కానీ, నీ మీద నా ప్రేమ మారదు. నీ కోసం ఎంత కాలమైనా ఎదురుచూస్తాను... ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ... ఈ సూర్యచంద్రులున్నంతకాలం.. "

" కవిత్వం వద్దు. వాస్తవం మాట్లాడు. సంవత్సరం తర్వాత కూడా నీకు నామీద ప్రేమ, నాకు నీ మీద ప్రేమ ఇలాగే నిలిచి వుంటే తప్పకుండా మళ్ళీ మనం కలిసి జీవిద్దాం... సరేనా?"

" సంవత్సరం తర్వాత నీకు నా మీద ప్రేమ ఇలాగే నిలిచి వుంటుందన్న నమ్మకం నీకు లేదా?"

"నమ్మకం లేకపోవడం అంటూ ఏమి కాదు. నమ్మకం వుంది..... కాని ఏ క్షణంలో ఏమి జరుగుతుందో చెప్పలేం కదా..... 365 రోజుల తర్వాత ఏం జరుగుతుందో ఇప్పుడే ఎలా చెప్పగలం?"

"చాలా హార్ష్‌గా మాట్లాడుతున్నావు?"

" అయామ్ సారీ..... నీకలా అనిపిస్తే.... బట్ ఐ లవ్‌యూ వివేక్ !....... ఈ క్షణం నా హృదయంలో నువ్వు తప్ప మరెవ్వరూ లేరు .... నేనెక్కడున్నా నువ్వు నాలో ఉంటావు?"

అలా అంటూనే ఆమె అతన్ని తన హృదయానికి హత్తుకుంది.... అతని లోని ప్రతి అణువునూ స్పృశించింది. రక్తాన్ని వేడెక్కించింది..... మరల్చి మత్తెక్కించి మరో ప్రపంచంలో కళ్ళు తెరిపించింది....స్త్రీ పురుషుల కలయికలో ఇంత ఉత్కృష్టమైన ఆనందం ఉంటుందా? అంత ఆనందాన్ని అనుభవించిన వాడు, ఇంత ఉన్నత శిఖరాల్ని అధిరోహించినవాడు మళ్ళీ మామూలు మానవమాత్రుడుగా మారిపోగలడా? ఎంత చిత్రం ఈ సృష్టి!

ఇంకా వారం రోజులకు అమెరికా వెళ్లిపోతుందనగా ఆమె -ఆవారం రోజుల్ని పూర్తిగా అతనితోనే ఉండిపోయింది. ఆ వారం రోజులు పగలు, రాత్రి

అన్న తేడా లేకుండా ఇద్దరూ ఒకరితో ఒకరు ఐక్యమైపోయి యేకప్రాణిగా జీవించారు. – ఆమెతో అలాగడిపిన అతన్ని ఆమె విడిచి వెళ్లి పోతున్నపుడు ఎంత దు:ఖాన్ని అనుభవించాడో! గుండెల్ని పిండి చేసిన అంత బాధను, అంత వేదనను అతడెలా భరించాడో ఊహించుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. సముద్రాలన్నీ ఏకమైపోతున్నట్టు – తనో ఊబిలో కూరుకుపోతున్నట్టు – ఫీలయ్యాడు. కానీ యేదీ అంతమైపోలేదు.... అన్నీ యథావిధిగా తమ పని తాము చేసుకుంటూనే ఉన్నాయి. ఆమె వెళ్లిపోయింది.... విమానంలో పైకెగిరి పోయింది... సప్త సముద్రాలుదాటి మరో ప్రపంచంలో కెళ్లిపోయింది– తనకూ ఆమెకు మధ్య దూరం అనంతంగా మారిపోయింది... అనంతంలో రైలు పట్టాలు కలుసుకుంటాయట – అక్కడకు వెళ్లిపోయింది.

తనామెకోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు.... "సారికా!" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా.... గుండెలు పగిలేలా అరుస్తూనే ఉన్నాడు.... ఆమెకు తన పిలుపు వినపించనే లేదు... ఆమెతో తిరిగి సంయోగమనే ఆశే తనను బతికిస్తోంది. చీటికి మాటికి టెలిఫోన్ చేస్తూ తనను డిస్టర్బ్ చెయ్యొద్దని వొప్పించుకొని వెళ్ళింది.... ఎప్పుడూ లేబరేటరీల్లో యేవేవో ప్రయోగాలు చెయ్యాలట– రిసర్చ్ మీదనే తన దృష్టినంతా కేంద్రీకరించాలట! కాన్‌సెంట్రేషన్ సడలొద్దట. అంతే! ఆమె తనకైతాను సృష్టించుకున్న కాన్‌సెంట్రేషన్ క్యాంపులో కెళ్లిపోయింది. ఆమె ఆ క్యాంపులో బంధీ అయిపోయింది. స్వేచ్ఛట, స్వేచ్ఛ! ఆమెకు స్వేచ్ఛ అన్నింటికంటె ముఖ్యమట! కాన్‌సెంట్రేషన్ క్యాంపులో చిక్కుబడిపోయిన ఆమెకు స్వేచ్ఛెక్కడిది?

ఆమె అమెరికా వెళ్ళి సంవత్సరం దాటింది– అయినా ఆమె రీసర్చ్ పూర్తికాలేదట– ఇంకో ఆరునెలలు ఎక్స్‌టెన్షన్ ఇచ్చారట.

అతడు ప్రతిరోజును, ప్రతీక్షణాన్ని లెక్క పెట్టుకుంటూ సంవత్సరం గడిపేశాడు.

"నువ్వింకో ఆరునెలలు వెయిట్ చెయ్యాలి– తప్పదు". సంవత్సరం గడిచాక ఎప్పుడొస్తున్నావని తను ఫోన్ చేస్తే ఆమె చెప్పింది."

"ఇంకో ఆరునెల్లా? " అన్నాడు హతాశుడైపోయి.

"అవును .... నేను చేసిన వర్క్ వాళ్ళకు చూపించాను – ఇంకో ఆరునెలల టైమిస్తే నా ప్రాజెక్ట్ పూర్తవుతుందని రిక్వెస్ట్ చేశాను. ఇంతవరకు నేను చేసిన

వర్క్‌ను వాళ్ళు పరిశీలించారు. చాలా బావుందని ప్రశంసించి నాకు సిక్స్‌మంత్స్ ఎక్స్‌టెక్షన్ ఇచ్చేశారు..."

"కానీ వాళ్ళు నా గొంతు నులిమేశారు.... నీ కోసం ఈ దిక్కుమాలిన దేశంలో ఓ దీనుడు దినమొక యుగంగా ఎదురుచూస్తున్నాడని నువ్వు మరచిపోయావు"

"సారీ డియర్... సిక్స్ మంత్స్ ఎంతలో గడిచిపోతాయి... డోన్ట్‌వర్రీ.... పూర్తిగా ఆరునెలలు కూడా పట్టకపోవచ్చు... నా ప్రాజెక్ట్ అంతకు ముందే పూర్తి కావచ్చు... ఎప్పుడు పూర్తయితే అప్పుడు వచ్చేస్తాగా..."

తను మళ్ళీ వెయిట్ చెయ్యడం... నెల గడిచింది.... రెండు నెలలు గడిచాయి.... మూడు నెలలు గడిచాయి.... ఇవ్వాల్టికి సరిగ్గా నాల్గు నెలలు గడిచిపోయాయి... తను ఎదురు చూస్తూనే ఉన్నాడు... సెకండ్లు... నిమిషాలు.... గంటలు ... పగల్లు... రాత్రిళ్ళు, రోజులు ... వారాలు, నెలలు.... గడిచిపోతూనే ఉన్నాయి... కానీ ఆమె రాదు ... ఆమె వస్తుందన్న ఆశలోంచి తనను పోనీదు... ఈఎదురు చూపుకు అంతం లేదు....

ఫోన్.... లాంగ్‌రింగ్.... లాంగ్ లాంగ్ రింగ్.... ఎక్కడో ఫోన్ మోగుతోంది- ఎక్కడో కాదు- తనింట్లోనే....అతడీ ప్రపంచంలో కొచ్చాడు- దిగ్గునలేచాడు. ఫోన్ మోగినప్పుడల్లా అతని గుండెలు వేగంగా కొట్టుకుంటాయి. ఫోన్ చేస్తున్నది ఆమెనేమో.... వచ్చేస్తున్నానని చెబుతుందేమో....

ఫోన్... ఇప్పుడు... ఈ క్షణం తనింట్లో ఫోన్ మోగుతున్నది...

ఫోన్ దగ్గరకు పరిగెత్తాడు...

"హాయ్ వివేక్!" అది ఆమె కంఠమే.... అతని గుండెల్లో వెయ్యి వీణలు మోగాయి.

"హాయ్ సారికా?"

"ఫోనెత్తడంలో ఇంత ఆలస్యమేమిటి?"

"నీ జ్ఞాపకాలు నన్నెక్కడెక్కడికో తీసికెళ్ళాయి.. అక్కణ్నించి రావడానికింత టైమ్ పట్టింది"

"అది సరే... నేను ఓ గంట క్రితమే ముంబైలో దిగాను... హైదరాబాద్ తీసికెళ్ళే ఫ్లైట్ కోసం వెయిట్ చేస్తున్నాను.... ఇంకో గంటన్నరలో హైదరాబాద్‌లో దిగుతాను..."

" రియల్లీ?"

" రియల్లీ"

"బయల్దేరేముందు నాతో...."

" చెప్పలేదు... చెప్పొద్దనే చెప్పలేదు"

" ఎందుకు?"

"నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని"

" నీ ప్రాజెక్ట్ ఇంకో రెన్నెల్లుండాలి కదా?"

" రెండు నెలలు ముందుగానే పూర్తిచేశాను... నా లైఫ్‌లో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయ్యడం ఓ గొప్ప అఛీవ్‌మెంట్... అదిగో... ఫ్లైట్ ఎనౌన్సయింది. రమ్మంటున్నారు... ఫోన్ పెట్టేస్తున్నా" అంటూ ఆమె ఫోన్ పెట్టేసింది.

ఆమె వస్తున్నదా? నిజంగా వస్తున్నదా?

వీధిలోకి పరిగెత్తి సారిక వస్తోందని దిక్కులు పిక్కటిల్లేలా పెద్దగా అరవాలని పించింది...

ఇంకో గంటన్నర.... జస్ట్ నైంటీ మినట్స్‌లో సారిక వచ్చేస్తుంది... ఇక తన తరతరాల... యుగ యుగాల వెయిటింగ్ అంతమవుతుంది.... సరిగ్గా 16 నెలలు... అంటే నాలుగు వందల ఎనభైరోజులు... పదకొండువేల ఐదువందల ఇరవై గంటలు.... పదిహేను లక్షల పదకొండు వేల రెండు వందల నిమిషాలు, తొమ్మిదికోట్ల, యేడులక్షల డెబ్భైరెండు వేల సెకండ్లు ఆమె కోసం ఎదురుచాశాడు. ఒక్కక్షణం కూడా ఆమెను తన మన:ఫలకం మీంచి చెరిపెయ్య లేకపోయాడు.... నిద్ర పోయినప్పుడు కూడా కలల్లో ఆమె... యే పుస్తకం తెరచినా ఆమె! ... టీ.వీ లో యే అందమైన ముఖం చూసినా ఆ మొఖంలో ఆమె... సినిమాకెళ్ళినా ఆమె... కాలేజీ కెళ్ళి పాఠం చెబుతున్నా ఆమె... తన అంతరాంతరాల్లో ... తన లోని ప్రతి అణువులో, తన రక్తంలోని ప్రతికణంలో ...తన మేధస్సులోని ప్రతి పొరలో.... ఆమె... ఆమెతో గడిపిన క్షణాల్ని మననం చేసుకంటూ, ఆమెతో గడపబోయే క్షణాలను ఊహించుకుంటూ... ఇన్ని కోట్ల క్షణాల్ని బరువుగా, బాధగా గడుపుతూ బతికాడు.... అన్న పానీయాలు కాదు తననింత కాలం బతికించింది... ఆమె జ్ఞాపకాలు ... ఆమె తిరిగి తనను చేరుకుంటున్నదన్న నిజం, ఆమెతో మళ్ళీ సంయోగం అనే ఊహ అతన్ని మరో మనోజ్ఞ ప్రపంచంలోకి, కలల ప్రపంచంలోకి తీసికెళ్ళింది.

ఆమె వస్తోంది... తన కోసం రెక్కలు కట్టుకొని పక్షిలా పైకెగిరి..... సప్తసముద్రాలు దాటి ..... వచ్చేస్తోంది... కాంతివేగంతో వస్తోంది.....

ఈ 16 నెలలు తనలోని ఆమె మీది ప్రేమ చెక్కుచెదరలేదు... వెళ్తూ వెళ్తూ ఆమె తనకో పరీక్ష పెట్టి వెళ్లింది. నేనొచ్చే వరకు నామీది నీప్రేమ ఇలాగే ఉంటే తిరిగి మనం కలుసుకుందామంది. కలిసి జీవిద్దాం అంది. ఆమె పెట్టిన ఈ పరీక్షలో తను నెగ్గాడు - నూటికి నూరు మార్కులు తెచ్చుకున్నాడు.

ఆమెకు తన మీద ప్రేమ కూడా ఇలాగే చెక్కు చెదరకుండా ఉండి ఉంటుందా? ఇలాగే రవ్వంత కూడా తగ్గకుండా ఉంటుందా? డిఫినెట్‌గా.... ఆమె అనుకున్నదాని కంటే రెండు నెలలు ముందే తన ప్రాజెక్ట్‌ను పూర్తి చేసుకొని తన కోసమే వస్తోంది.

అతడు లేచాడు...... మ్యూజిక్ సిస్టమ్ ఆన్ చేశాడు... హరిప్రసాద్ చౌరాసియా ఫ్లూటు వాయిద్యం.... మాల్‌కోస్ రాగం ఆలపిస్తున్నాడు. ఆ వేణుగానంలోని ఆరోహణ అవరోహణలు అతన్నెక్కడెక్కడికో తీసికెళ్తున్నాయి..... కొండకోనల్లోంచి, దట్టమైన అరణ్యాల్లోంచి, జలపాతాల్లోంచి, నదీ ప్రవాహల్లోంచి, అలలు అలలుగా తేలియాడ్తూ, అతని హృదయాన్ని స్పృశిస్తున్న ఆ వేణుగానం అతనిలో ఎన్నో జ్ఞాపకాల్ని తట్టి లేపుతున్నాయి.... సారికను మొదటిసారి ఎక్కడ కలుసుకున్నాడో..... అప్పుడామెతో యేం మాట్లాడాడో....... ఆ తర్వాతెప్పుడు ఎక్కడ కలుసుకన్నారో....... మొదటిసారి ఇద్దరి శరీరాలు ఐక్యమైపోయిందెప్పుడో.... ఆ దృశ్యాలన్నీ అతని మస్తిష్కంలో తిరగసాగాయి... ఎన్నోసార్లు ఎంత ఆనందపరచిందో అంత ఏడిపించింది. ఆమె సహనానికి రాణైతే తను వ్యసనానికి బానిస - వాసంత సమీరం ఆమైతే హేమంత తుషారం తను - కాలానికి కళ్ళెం వేసి ప్రేమకి గొళ్ళెం తీస్తారు.

ఆమె జ్ఞాపకాలతో అతనికా గంట ఓ క్షణంలా గడిచిపోయింది......

ఇంకో అర గంటలో ఆమె వచ్చేస్తుంది. అరగంటలో ఆమె హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో దిగుతుంది. తను వెళ్లాలి. పరిగెత్తాలి. ఆమెను అందుకోవాలి.

కథా నిలయం
శ్రీకాకుళం

# 2

ఇంటి బయట కాలింగ్‌బెల్ మోగింది. ఇప్పుడెవరొచ్చుంటారు? ఆ బెల్ చప్పుడు అతనికి అపశకునంలా ధ్వనిస్తోంది.

వివేక్ వెళ్లి తలుపు తీశాడు-

ఎదురుగా సుమంత్‌రెడ్డి!

" హాయ్ సుమంత్! వ్వాట్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రైజ్!"

"నిన్నిలా సర్‌ప్రైజ్ చేద్దామనే ఫోన్ చెయ్యకుండా వచ్చేశాను..."

" వండర్‌ఫుల్! స్టేట్స్ నుండెప్పుడొచ్చావు?"

"రెండ్రోజులయ్యింది... అంతే! నీ కోసం పరిగెత్తుకొని ఇలా వచ్చాను"

ఇద్దరూ వచ్చి సోఫాలో కూర్చున్నారు.

"ఎలా ఉంది స్టేట్స్ ఎక్స్‌పీరియన్స్"

" బాగుంది. మనం వాళ్ళ స్థాయిని చేరుకోవడానికి ఇంకో వంద సంవత్సరాలు పడ్తుంది."

"వంద సంవత్సరాలు గడిచేటప్పటికి వాళ్ళింకెంత దూరం వెళ్తారో?"

" కరెక్ట్"

" మళ్ళీ వెళ్తున్నావా?"

" వెళ్లాలిగా...."

" స్టేట్స్‌లో మన వాళ్ళెవరైనా కలిశారా?"

" చాలా మంది కలిశారు... స్టేట్స్‌లో ఎక్కడ చూసినా మనవాళ్ళే"

" మనవాళ్ళే అంటే?"

" మన తెలుగువాళ్ళు...."

" ప్రత్యేకంగా చెప్పుకో తగ్గ వాళ్ళెవరన్నా కలిశారా "

" ఔను .... మరచేపోయాను... నీ స్వీట్‌హార్ట్, సారిక కలిసింది...."

" సారిక నీకు కలిసిందా?"

" అవును, ఆమె కూడా నేనున్నచోటే ఉంటోంది....."

" రియల్లీ?"

" అవును...."

" సారిక ఈ రోజే ఇండియా వస్తోంది..."

“ ఈ రోజే ఇండియా వస్తోందా? ఇంపాజిబుల్”

“ ఇప్పుడే తనొస్తున్నట్టు ముంబయ్ నుండి ఫోన్ చేసింది”

“ అంటే ..... ఆమె ముంబయ్ దాకా వచ్చేసిందా?”

“ అవును... ముంబయ్‌లో ఫ్లైట్ దిగి హైదరాబాద్ ఫ్లైట్ కోసం ఎదురు చూస్తూ నాకు ఓ అరగంటముందే ఫోన్ చేసింది... ఈపాటికి ఆమె హైదరాబాద్ ఫ్లైట్ స్టార్టయ్యే ఉంటుంది”

“ నేను విన్న దాని ప్రకారంమైతే ఆమె ఇప్పుడే ఇండియా రాకూడదే !”

“ నువ్వేం విన్నావు?”

“ వినడమే కాదు ... చూశానుకూడా”

“ యేం విన్నావు? యేం చూశావు? త్వరగా చెప్పెయ్”

“ చెబితే నువ్వు బాధ పడతావేమొ”

“ నేను బాధపడతానని ముందే ఎందుకు ఊహించుకుంటున్నావు?”

“ నువ్వామెను గాఢంగా ప్రేమించావని తెలుసు”

“ తెలిస్తే?”

“ఆమె స్టేట్స్‌లో ఇంకొకరితో కలిసి జీవిస్తోందని చెబితే నువ్వు బాధపడవా?”

బాధ పడ్తున్నా అతనికి బాధ పడ్తున్నట్టు కనిపించకూడదు, అనుకున్నాడు. తన మనసు శంకించినట్టే ఇతడేదో ప్రమాదాన్ని సృష్టించడానికే వచ్చాడు. అయినా తను గంభీరంగానే ఉండాలి.

“పడను.. ఆమెకు ఎవరితోనైనా కలిసి జీవించే స్వేచ్ఛ ఉంది”

“ మీరిద్దరు పెళ్ళి చేసుకుందామనుకున్నారు కదూ?”

“ నేననుకున్నాను – ఆమె అనుకోలేదు... పెళ్ళికి ప్రేమకూ ముడి పెట్టొద్దు అంది”.

“ ఎప్పటికైనా మారకపోతుందా అన్న ఆశ నీలో ఉండేది కదూ?”

“ మార్పు మానవ సహజం. ఆమె మారుతుందని అనుకున్న మాట నిజమే.... కానీ ఆమె మీద నాకేదో హక్కున్నట్టుగా నేనెన్నడూ అనుకోలేదు... కాబట్టి నువ్వేం చెప్పినా నేను బాధ పడే ప్రసక్తే లేదు”

“ అయితే చెబుతా... ఆమె స్టేట్స్‌లో ఇంకొకరితో కలిసుంటోంది– వాళ్ళిద్దరు ప్రేమించుకుంటున్నారనీ, కలిసి జీవిస్తున్నారని అక్కడ చాలా మంది

చెప్పారు- వాళ్ళిద్దరు కలిసి తిరగడం, ఒకే ఇంట్లో ఉండటం నేను కూడా చూశాను... ఆమె అతన్ని చేసుకొని అక్కడే స్థిరపడిపోతుందని కూడా నేను విన్నాను... అందుకే ఆమె ఇండియా వస్తోందని నువ్వు చెప్పినప్పుడు నేను చాలా ఆశ్చర్యపడ్డాను. ఇప్పటికీ నేనామె ఇండియా వస్తోందంటే నమ్మలేకపోతున్నాను."

" నువ్వు నమ్ము... నమ్మకపో... ఆమె ఇండియా రావడం నువ్వు నమ్మకపోవడం వల్ల ఆగిపోదు... ఇంకాస్సేపట్లో ఆమెను నేను బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకోబోతున్నాను. కావాలంటే నువ్వూ నాతో రావొచ్చు."

" నువ్వు చెప్పిన దాన్ని బట్టి నాకొకటి అర్థమౌతోంది."

" యేమిటి నీ కర్థమౌతున్నది?"

"ఆమె అమెరికాలో ఉన్నంతసేపు అతనితో, ఇండియాలో ఉన్నంతసేపు నీతో ఉండబోతున్నదన్నమాట! ఆమె ఎక్కడికెళ్తే అక్కడ ఓ లవర్‌ను సంపాదించుకునేటట్టుంది."

"సంపాదించుకుంటుందే అనుకో- నీకేమన్నా అభ్యంతరమా?"

" అభ్యంతరం నీకుంటుంది... నాకెందుకుంటుంది ."

"నీ ధోరణి చూస్తోంటే నీకేదో అభ్యంతరమున్నట్టే అనిపిస్తోంది"

"అబ్బే! అలాంటి దేమీలేదు.... కానీ నువ్వు నాకో విషయం చెప్పాలి.... ఆమె అమెరికాలో ఓ సంవత్సరం పాటు వేరే ఎవరితోనో కలిసి జీవించిందని తెలిశాక కూడా నువ్వామెను ప్రేమిస్తూనే ఉన్నావా? ఆమె మీద నీ అభిప్రాయం ఏమీ మారలేదా?"

" ఏమీ మారలేదు- ఆమెను ప్రేమిస్తూనే ఉంటాను- ఆరాధిస్తూనే ఉంటాను"

" పైకలా అంటున్నావు గానీ లోపల నువ్వు బాధ పడ్తున్నావని నాకు తెలుసు"

"నీకు తెలిసింది చాలా తక్కువ - నువ్విక వెళ్ళొచ్చు... నేను ఎయిర్‌పోర్ట్ కెళ్లాలి...."

"సారీ వివేక్! నీకు బాధ కల్గించి ఉంటే సారీ..."

అతడు బయటకు వెళ్ళి కారు స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు-

అతడు చెప్పింది నిజమేనా?

నిజమే కావొచ్చు - నిజం కాకపోవచ్చు- దానివల్ల సారికతో తనకున్న

సంబంధంలో తేడా యేమైనా ఉంటుందా? ఆమె మీద తనకున్న ప్రేమ మారుతుందా? నాటెటాల్! అలాంటప్పుడు అతడు చెప్పిన ఆ విషయాన్ని గూర్చి తను ఆలోచించడం దేనికి?

తను వెంటనే బయల్దేరాలి.... బేగంపేట విమానాశ్రయానికి వెళ్ళి ఆమెను రిసీవ్ చేసుకోవాలి.... 16 నెలల తర్వాత ఆమెను కలుసుకోబోతున్నాడు.... వెంటనే ఆమెను తన గుండెలకు హత్తుకోబోతున్నాడు.... ఆమె శరీరంతో తన శరీరాన్ని పెనవేసి ఆమె ఆత్మలో తన ఆత్మను విలీనం చేసి, ఇద్దరు వ్యక్తులుగా అంతమై యేకవ్యక్తిగా  పునర్జన్మను పొందబోతున్నాడు- సారిక నీతోనే కాదు ఇంకెంతో మందితో ఐక్యమైపోయిందట! నాన్‌సెన్స్... అబసల్యూట్ నాన్‌సెన్స్.... ఆమె ఎవరితోనూ ఐక్యంకాలేదు.... ఆమె తనను తప్ప మరెవ్వరినీ ప్రేమించలేదు.... వాడు నీ మీది ఈర్ష్యతో అలా చెప్పాడు. కానీ సుమంత్... మై బెస్ట్‌ఫ్రెండ్... అలా చెబుతాడా? అబద్ధం చెప్పాల్సిన అవసరం అతనికేం ఉంది?.... తన మీద అతనికి ఈర్ష్య ఎందుకుంటుంది? అతడు చెప్పేది నిజమేనేమొ... నిజమైతే మాత్రం యేం? తను సారికను ప్రేమించకుండా ఉండగల్గుతాడా? సారిక కోసం ప్రతీక్షణాన్ని లెక్కించుకుంటూ బతుకుతున్న తను సారికను కలుసుకోకుండా ఉండగలడా? అగ్నిలా మారిపోతున్న ఈ శరీరాన్ని ఆమె శరీరంతో పెనవేస్తే తప్ప చల్లారదు....

సారిక శరీరం ఇప్పుడు తన కోసం ఎదురుచూస్తున్న శరీరంకాదు ...ఆమె తన శరీరాన్ని ఎంత మంది కర్పించిందో!... మలినమై పోయిన ఆ శరీరం తనకక్కరలేదు.... విరహాగ్నిలో క్రుంగి, కృశించి, నశించిపోతాడే తప్ప ఎంగిలిపడిన అమె శరీరాన్ని ఆశించలేడు... లేదు. అంతా నీ అనుమానం- నీలోని అనుమానమనే భూతాన్ని భూస్థాపితం చెయ్యలేకపోతున్నావు... వాడు... ఆ సుమంత్ గాడు, నీలో ఈ అనుమానం అనే చిచ్చును రగిల్చిపోయాడు.. ఆ చిచ్చు నిన్ను కాల్చేస్తుంది. ఆ చిచ్చును నువ్వింకా పెంచి పోషించుకుంటున్నావు... నీలోని పురుషాహంకారం నశించలేదు.... నువ్వు కాక మరెవరో నువ్వు ప్రేమించిన స్త్రీని అనుభవించారన్న భావనలోంచి జనిస్తున్న ఈర్ష్య నిన్ను దహించివేస్తున్నది... డిసీజ్ మేల్ చావనిజం.... యూ ఆర్ ఎ మేల్ చావనిస్ట్ పిగ్! నీలోని ఈ పురుషాధిక్యత అనే ఈ మృగాన్ని సంహరించుకోకపోతే నీకు విముక్తి లేదు... సారిక ప్రేమకు నువ్వు అర్హుడివి కావాలంటే నువ్వు యెదగాలి... ఈర్ష్యాద్వేషాల్ని

జయించాలి. నీ హృదయంలో ప్రేమ తప్ప మరొక సంవేదన ఉండకూడదు... యెదగాలి... నిన్ను నువ్వు సంహరించుకోవాలి.... సంస్కరించుకోవాలి..... ఆకాశమంత ఎత్తు యెదగాలి.... ప్రతి మనిషిలోనూ ఓ మరుగుజ్జు... అంటే పిగ్మీ ఉంటాడట.. అలాగే ఓ మహాకాయుడు ... అంటే జెయంట్ ఉంటాడట.... ప్రతి మనిషీ ఈ రెండింటి మధ్యే తిరుగుతుంటాడట – పిగ్మీ నుండి జెయింట్ స్థాయికి యెదగడానికి నిరంతరం ప్రయత్నం చేసేవాడే మహోత్కృష్ట మానవుడిగా ఎదగగల్గుతాడు....తనా మహోత్క్రష్ట మానవుడిగా ఎదగాలి.

నోనోనో... తనో మామూలు మానవుడే.... తనలోని ఈర్ష్యాద్వేషాల్ని జయించలేదు... తనలో కామ, క్రోధ, మధ, మాత్సర్యాలన్నీ ఉన్నాయి. తనో సామాన్యమానవుడు.. తనో మరుగుజ్జు... అయామ్ ఎ పిగ్మీ..నాట్ ఎ జెయంట్... జెయెంట్‌లా మారాలన్న మోజు కూడా తనకు లేదు... యస్... అయామ్ ఎ మేల్ చౌవనిస్ట్ పిగ్ !... స్త్రీ అంటే అత్యంత పవిత్రంగా ఉండాలి. ఒకే పురుషుణ్ణి ప్రేమించాలి... ఆ పురుషుణ్ణే పెళ్ళాడాలి.... జీవితాంతం అతనితోటే ఉండిపోవాలి... అతన్ని భర్తగా గౌరవించాలి.... అతడు చెప్పినట్టు వినాలి....అతనికి భోజ్యేషు మాతలా, శయనేషు రంభలా, కార్యేషుదాసిలా ఉండిపోవాలే తప్ప అన్నిటిలోను నేను నీతో సమానురాలినే అంటూ భర్తతో కయ్యానికి కాలుదువ్వకూడదు– పురుషుడు బయటకెళ్ళి సంపాదిస్తాడు–భార్యా పిల్లల్ని పోషిస్తాడు... స్త్రీ ఇంట్లో ఉండి భర్తకోసం వంటచెయ్యాలి... పిల్లల్ని కనాలి. వాళ్లను కంటికి రెప్పలా కాపాడుకోవాలి.... బయట్నించి అలసిసొలసి ఇంటికొచ్చిన భర్తకు అన్నిసేవలు చేసి అతని అలసటను పోగోట్టాలి. తన వళ్లో పడుకోబెట్టుకొని సేద తీర్చాలి... రాత్రి రంభలా మారిపోయి అతని శృంగారకోరికల్ని తీర్చి స్వర్గసుఖాల్ని అందించాలి.... ఇది తరతరాలుగా, యుగయుగాలుగా కొనసాగుతున్న పరంపర.. స్త్రీ పురుషుల విధులేమిటో మన సమాజం చాలా స్పష్టంగా నిర్వచించింది. సమాజ క్షేమంకోసమే, సమాజ స్థిరత్వంకోసమే, సమాజ వికాసంకోసమే, సమాజ ఆరోగ్యంకోసమే,సమాజ కొనసాగింపుకోసమే స్త్రీ పురుషుల విధులేమిటో ఇంత స్పష్టంగా,ఇంత నిర్ద్వంధ్వంగా నిర్వచించారు... ఈ పరంపరను, ఈ సంప్రదాయాన్ని, ఈ ధర్మాన్ని ధిక్కరించే అధికారం ఎవరికీలేదు... సారికైనా సరే.... మరెవరైనా సరె, ఈ ధర్మాన్ని పాటించాల్సిందే.

వో మైగాడ్! యేమిటిది? ఈ రోజు తనింత దారుణంగా, ఇంత మూర్ఖంగా, ఇంత చాంధసంగా, ఇంత గుడ్డిగా, ఇంత అశాస్త్రీయంగా, ఇంత సంప్రదాయబద్ధంగా ఆలోచిస్తున్నాడేమిటి? తనకివ్వాళ్ళేమయింది? తన బుర్ర చెడిపోయింది- తననేదో భూతం, సంప్రదాయం అనే భూతం, పరంపర అనే భూతం ఆవేశించింది- తనిప్పుడు తనుకాడు... తనో సంప్రదాయం- తనోధర్మం. తనింతకాలం తనలో పెంచిపోషించు కున్న ఆధునిక దృక్పథం ఇంత అకస్మాత్తుగా అంతమైపోయిందా? సమాజంలో స్త్రీ పురుషులిద్దరికీ సమాన గౌరవం, సమాన గుర్తింపు ఉండాలన్న తన దృక్పదం యేమై పోయింది? స్త్రీ గానీ పురుషుడుగానీ ఒకే ఒక్కసారి ప్రేమిస్తారన్నదొక "మిత్" అనీ తను ఎందరితోనో వాదించాడు. అలాగే ఒక పురుషుడు, ఒక స్త్రీ శాశ్వతంగా కలిసి ఉండాలని, పెళ్ళి పేరుతో వాళ్ళను నిర్బంధించటం కూడా తప్పని తను నమ్మాడు-

ఈ విషయాన్ని గూర్చి ఎన్నో సార్లు చర్చించాడు - ఆమే తనూ ఈ విషయాన్నిగూర్చి ఒక అంగీకారాన్నిక్కూడా వచ్చారు..

అలాంటి తను ఈ రోజు ... ఈ క్షణం, ఇంత నిర్హేతుకంగా ఆలోచిస్తున్నాడేమిటి? థీసీజ్‌నాన్‌సెన్స్.... దిసీజ్ డికడెన్స్! ఇది వికటిస్తుంది. వ్వాట్ ఎ షాల్ వై ఫ్రెండ్... జెయింట్‌వు కాబోయి పిగ్మీగా మారిపోతున్నావు....నోనోనో అయామ్ నాట్ ఎ జాయింట్... నేను పిగ్మీనే.. నేనో మరుగుజ్జునే - నేను సంప్రదాయాన్ని గౌరవిస్తాను.... ఒక పురుషుడికి ఒక స్త్రీ... పెళ్ళంటే నూరేళ్ళపంట... పెళ్ళి చేసుకున్న వాళ్లు జీవితాంతం కలిసే ఉండాలి.... అలా కలిసుండకపోతే సమాజం యేమైపోవాలి? పిల్లలేమైపోవాలి? సమాజంలో స్థిరత్వం ఎలా ఉంటుంది?....సారిక అసలు పెళ్ళే వద్దంటుంది- పెళ్ళి ప్రేమను నాశనం చేస్తుందంటుంది.... ఆ మాట నిజమే కావొచ్చు.... కానీ అందరూ మాకు పెళ్ళిళ్ళు వద్దు...ప్రేమించుకోవడం దగ్గరే ఆగిపోతాం... సెక్స్ సుఖాన్ని అనుభవిస్తాం... అంతే... పెళ్ళాం పిల్లలు... అనే జంఝాటంలో పడిపోదల్చుకోలేదు... అందరూ ఇలా అనుకుంటే ఈ సమాజం యేమైపోవాలి? పిల్లల్ని కనకపోతే ఈ సమాజానికి కొనసాగింపెలా సాధ్యమౌతుంది? ఈ పరంపర ... ఈ సంప్రదాయాలు... ఈ నాగరికత .... ఈ అభివృద్ధి...ఈ హైటెక్ సుఖాలు... ఇవన్నీ తర్వాతి తరం కోసమేకదా.... తర్వాతి తరమనేదే లేనప్పుడు ఇవన్నీ ఎందుకు?సారిక పాశ్చాత్య సంస్రృతికి బానిసై పోయింది- మన సంస్కృతిని

మరచిపోయింది. అయినా తను సారికను ప్రేమిస్తూనే ఉంటాడు.... తన ప్రేమ అజరామరం, అనంతం, అపూర్వం, అనితరసాధ్యం.

## 3

బేగంపేట విమానాశ్రయం - అదిగో సారిక వచ్చేస్తున్నది.... ఆ నడకలో... ఆ చూపులో... ఆ పెదవి విరుపులో, ఆ కనుబొమ్మల్ని పైకెత్తడంలో, ఆ చీర కట్టులో, ఎప్పుడూ చెరిగిపోని ఆ చిరునవ్వులో ఎంత అందం! ఆ డెవిల్ మేకేర్ లాంటి ఆమెలోని ఆ ఔదాసీన్యంలో ఎంత డిగ్నిటీ! ఫర్‌గెట్‌మీ నాట్ అని చెప్తున్న ఆ కళ్ళలో ఎంత గర్వం! ఎంత ఆత్మ విశ్వాసం! ఎంత ఆత్మ గౌరవం! ఆమె అందమంతా ఆమె కళ్ళలోనే ఉందేమో! కళ్ళెత్తితే చాలు కనకాభిషేకాలు!

లగ్గేజినంతా ట్రాలీలో వేసుకొని ఆమె అతన్ని సమీపించింది....

"హాయ్ వివేక్...."

"వచ్చావన్నమాట, నిజంగా వచ్చేశావన్నమాట!"

అతని నోటి వెంట మాటలు స్పష్టంగా రావడంలేదు.

"రాననుకున్నావా?"

"అనుకోలేదు"

"లేదు, నువ్వు నిజం చెప్పడం లేదు-నేను రాననుకున్నావు కదూ? ఎప్పుడు ప్రవాసంలోనే ఉండిపోతాననుకున్నావు కదూ?"

"లేదు- నేనీ ప్రపంచానికి గుడ్‌బై చెప్పేలోగానైనా వస్తావనుకున్నాను"

"ఎంతాశ?"

"ఆ ఆశే నన్ను బతికించింది"

"నా మీద చాలా కోపంగా ఉందేమో?"

"ఎందుక్కోపం?"

"నీకు తెలుసు. నీక్కొంచెం కోపం ఎక్కువే కదా?"

"నీ మీద కోపగించుకోవడమంటే నా మీద నేనే కోపగించుకోవడం...."

"నువ్వేకాదు.... చాలా మంది తమ మీది తమ కోపాన్నే ఇతరుల మీద ప్రదర్శిస్తుంటారు...."

"నువ్విలాంటి నీతులూ, సూక్తులు చెబుతూనే ఉంటావు గానీ ప్రయాణం బాగా సాగిందా?"

" బాగానే సాగింది"

" ఇండియాలో ఉండిపోతావా? మళ్ళీ అమెరికాకు ఎగిరిపోతావా?"

" చెప్పలేను....." అంటూనే ఆమె హాయిగా నవ్వింది. అతడు నవ్వలేకపోయాడు."

" వెళ్ళేటప్పుడు ఈ ప్రాజెక్ట్ అయిపోయాక మళ్ళీ వెళ్ళనన్నావు...."

" అప్పుడలా అంటే అనొచ్చు.... కానీ అప్పటికీ ఇప్పటికీ నువ్వూ నేను అలాగే ఉన్నామా? మనిషనే వాడు - స్త్రీ కావొచ్చు, పురుషుడు కావొచ్చు, అనుక్షణం మారుతూనే ఉంటాడు..... జస్ట్‌లైక్ ఎ రివర్.. నదిలో నీళ్ళు స్థిరంగా ఉంటాయా?"

" నీ సిద్ధాంతాలన్నీ తర్వాత తీరికగా చెబుదువుగానీ, ఇప్పుడెక్కడికెళ్దాం?"

" నువ్వెక్కడికి తీసికెళ్తే అక్కడికి... ఈ విశాల ప్రపంచంలో ప్రస్తుతం నువ్వు తప్ప నాకెవరూ లేరు..."

" వ్యంగ్యమా?"

" కాదు... నిజం... నేనిప్పుడు నీ ముందున్నంత నిజం"

"నా కంత అదృష్టమా?"

" అదృష్టం నీదే అని ఎందుకనుకోవాలి.... నాదీ కావొచ్చుగా...... ఈ మహానగరంలో నాకోసం పరిగెత్తుకొని వచ్చే నువ్వుండడం నాఅదృష్టం కాదా?"

ఇద్దరూ ఆమె లగ్గేజిని అతని కారు డిక్కిలో సర్దేసి కారెక్కారు - అతడు డ్రైవ్ చేస్తున్నాడు-

" అమెరికాలో రోజులెలా గడిచాయి"

"రోజులెలా గడుస్తున్నాయన్న స్పృహ లేకుండానే గడిచిపోయాయి"

" అంటే ప్రాజెక్ట్ పూర్తి చెయ్యాలన్న ధ్యాస తప్ప మరో ధ్యాస లేకుండా గడిపావన్నమాట"

" లేదు ... లేదు .... అప్పుడప్పుడు నా ధ్యాస నీ మీదకెళ్ళింది... రాత్రుళ్ళొచ్చి రూమ్‌లో పడుకుంటే నీతో గడిపిన ఆ ఎన్నో మధురమైన రాత్రులు గుర్తొచ్చాయి"

" ఆర్యూ జోకింగ్?"

" నోనో.... అయామ్ సీరియస్"

" అమెరికాలో కొత్తగా ఎవరూ పరిచయం కాలేదా?"

ఆ ప్రశ్న ఎందుకడిగావు? .... నీలోని భూతం నిద్రలేస్తున్నది.

" ఎందరో పరిచయమయ్యారు. హాయ్ అంటే హాయ్ అనుకునే పరిచయం... అమెరికాలో మనల్ని చూసిన ప్రతివాడు హాయ్! అంటూనే తన దారిన తను వెళ్లిపోతాడు"

" అంతేనా? అంతకుమించి యేమి ఉండదా?"

మళ్ళీ నీలో భూతం ప్రవేశిస్తున్నది.

" అంతకుమించి యేముంటుందనుకుంటున్నావు?"

" యేమీలేదు - ఊరికేనే అడిగాను" భూతాన్ని జోకొట్టే ప్రయత్నం!

ఇద్దరూ కాస్సేపు నిశ్శబ్ధంగా ఉండిపోయారు. అతడు డ్రైవ్ చేస్తున్నాడు-ఆమె ఆలోచిస్తున్నది.

"అమెరికా మీద నాకున్న కొన్ని భ్రమలు తొలిగిపోయాయి" అందామె చాలా సీరియస్‌గా.

" యేమిటో ఆభ్రమలు"?

" స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు నిలయం అమెరికా అనుకున్నాను. అక్కడి ప్రజలకు స్వేచ్ఛ ఉన్నమాట నిజమే. కానీ అతి స్వేచ్ఛ కూడా వెర్రితలలు వేస్తుంది... అదే నాకు అమెరికాలో కనిపించింది...."

" ఇంకా..."

"అక్కడి ప్రజల్లో ఇండివిద్యువలిజమ్ చాలా ఎక్కువ- ఎవరి సుఖం వారే చూసుకుంటారు- పదిమంది కలిసి ఉండటమనేది లేనే లేదు- పెళ్ళీ, పిల్లలు కూడా వద్దనే స్థితికి వెళ్ళిపోయారు..."

"అమెరికాకు వెళ్ళేముందు ఇంచుమించు నీకూ ఇవే అభిప్రాయాలుండేవి కదా... పెళ్ళి, పిల్లలు మన స్వేచ్ఛను హరించివేస్తాయని, నేనసలు పెళ్ళే చేసుకోనని అంటుండేదానివికదా...."

"అవును.. నేను మరో విషయం కూడా పదే పదే చెబుతుండేదానిని... మరచిపోయావా? వ్యక్తులనేవాళ్ళు ఎప్పుడూ ఒకే రకంగా ఉండరని ... వాళ్లు అనుక్షణం మారుతూ ఉంటారని...."

"నువ్వు మారావా?"

"మారానని అనుకుంటున్నాను.. అక్కడి ప్రజల్లోని యాంత్రికజీవనం మీద నాకు వెగటు పుట్టింది- ప్రతివాడూ మొఖంమీద చిరునవ్వు అంటించుకొని

హాయ్ అంటాడు. మనమూ హాయ్ అంటాం... అంతే- ఆతర్వాత ఎవరిదారి వారిదే.... ఎవరిలోకం వారిదే- అక్కడ ప్రేమ కంటే సెక్స్‌కు ఎక్కువ ప్రాముఖ్యం కనిపించింది- ఆకలేస్తే హోటల్‌కెళ్లి భోజనం చేసినట్టు సెక్స్ కోరిక కల్గగానే స్త్రీ పురుషులు చాలా మెకానికల్‌గా ఆకోరికను తీర్చుకొని ఎవరి దారిన వారు వెళ్లిపోతారు... కొందరేమొ ప్రేమించామనుకొని పెళ్లిచేసుకుంటారు... పెళ్లిచేసుకున్న కొద్దిరోజుల్లోనే విడాకులిచ్చుకుంటారు... ఇప్పుడైతే అక్కడ వివాహవ్యవస్థ పూర్తిగా బ్రేకయిపోతున్నది- పెళ్లిని ఒక గుదిబండగా భావిస్తున్నారు...స్త్రీలు పురుషులు యే బాధ్యతలు లేకుండా వ్యక్తిగత సుఖమొక్కటే జీవితలక్ష్యమన్నట్టుగా తిరుగుతున్నారు- వారానికి ఐదురోజులు గొడ్డు చాకిరి చెయ్యడం... మిగతా రెండురోజులు విచ్చలవిడిగా తినడం, తాగడం, సెక్స్‌లో మునిగి తేలడం... ఇదీ అమెరికన్ లైఫ్... ఐదురోజుల్లో సంపాదించిందంతా రెండ్రోజుల్లో ఖర్చుచేస్తారు- ఓ ఇల్లు లేదు... ఓ భార్య లేదు- పిల్లలు లేరు... తల్లిదండ్రులు లేరు.. అమ్మమ్మలు లేరు-నానమ్మలులేరు... తాతయ్యలు లేరు... అంతటి విశృంఖలత్వాన్ని నేను భరించలేకపోయాను.”

“సర్‌ప్రైజింగ్ !”

“జీవితంలో ప్రేమలు, అనుబంధాలు అవసరమేననిపిస్తున్నది... తల్లిదండ్రుల ద్వారా పొందే ప్రేమ, స్నేహితుల ద్వారా పొందే ప్రేమ, భార్య భర్త ద్వారా పొందే ప్రేమ, భర్త భార్య ద్వారా పొందే ప్రేమ, పిల్లల ద్వారా తల్లిదండ్రులు పొందే ప్రేమ... పిల్లలు తల్లిదండ్రుల ద్వారా, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల ద్వారా పొందే ప్రేమ.... ఇవన్నీ అవసరమే... జీవితం అంటే తినడం, తాగడం, సెక్స్‌లో మునిగి తేలడం మాత్రమే కాదుగదా.... స్వేచ్ఛ మనిషికి అవసరమే కానీ స్వేచ్ఛతో బాటు బాధ్యతను కూడా వ్యక్తి స్వీకరించాలి... స్వేచ్ఛను బాధ్యతనుండి విడదీయలేమనిపిస్తుంది....”

“నీలో ఇంతమార్పుకు కారణమేమిటో...”

“కారణం చెప్పానుగా.. అక్కడ వాళ్ల జీవితాల్ని చూశాక నాలో ఈ మార్పు...”

“ నీ వ్యక్తిగత జీవితంలో కూడా....”

“ అంటే ”

"అక్కడ నువ్వెవరినైనా ప్రేమించడం... వాళ్లతో కలసి జీవించడం... అలాంటి అనుభవాలేమన్నా..."

అదిగో.... మళ్ళీ నీలోని ఆ భూతం జడలు విరబోసుకొని నర్తిస్తున్నది.

ఆమెను ఇలాంటి ప్రశ్నలు అడగొద్దనుకున్నాడు - కానీ అడుగుతూనే ఉన్నాడు.

" అలాంటి అనుభవాలు కూడా కల్గాయి.. ఒకతనితో కలిసి కొన్నిరోజులు జీవించాను.. కానీ అతన్ని ప్రేమించలేదు- జస్ట్, సెక్యూరిటి కోసం మాత్రమే అతనితో కలిసున్నాను."

ఆమె నిజాన్ని నిర్భయంగా, నిస్సంకోచంగా ఒప్పేసుకున్నది-గ్రేట్! షీ ఈజ్ గ్రేట్!

వాళ్లలా మాట్లాడుకుంటూ వివేక్ ఉంటున్న ఇంటిని చేరుకున్నారు -

కారు పోర్టికో కింద పార్కుచేసి ఇద్దరు కలిసి లగేజిని ఇంట్లోకి చేర్చారు-స్నానం చేసొస్తానని ఆమె బాత్‌రూంలోకెళ్ళి పోయింది- అతన్ని ఆలోచనలు ఆక్రమించాయి...

అయితే సుమంత్ చెప్పింది నిజమే నన్నమాట... ఒక్కరితోటేకాదు... ఎంతమందితో కలిసి జీవించిందో..... అందుకే అమెకా జీవితం మీద వెగటు పుట్టింది.... ఆమెలో కల్గిన మార్పును చూస్తోంటే ఆమె తనను పెళ్ళి చేసుకోవడానికక్కూడా ఒప్పుకోవచ్చునేమో?... తనలో ఎంతో విప్లవాత్మకభావాలున్నాయని గర్వించే ఆమె ఎక్కడెక్కడో తిరిగి తిరిగి మళ్ళీ ఇక్కడికే వచ్చేసింది-తిరిగి భారతీయ సంప్రదాయాన్నే తలకెత్తుకునే స్థితికొచ్చేసింది- ఇక్కడి వివాహ వ్యవస్థే గొప్పదనే స్థితికొచ్చేసింది.... ఇప్పుడు తనేం చేయ్యాలి? ఎంతో మందికి తన శరీరాన్ని అర్పించిన ఆమెను తనింకా ప్రేమిస్తూనే ఉన్నాడా? ఆమెతో ఇప్పుడు కూడా కలిసి జీవించగలడా? మైలపడిపోయిన ఆమె శరీరంతో తన శరీరాన్ని ఐక్యం చెయ్యగలడా? లేదు.... లేదు ... ఆమె శరీరాన్ని తనిప్పుడు కనీసం తాకనైనా తాకలేడు... ఎంతోమంది చేతిలో నలిగిపోయిన ఆ శరీరం తనకక్కర్లేదు- ఆమె శరీరం మైలపడిపోవడమేమిటి? నాన్‌సెన్స్! హృదయం పవిత్రంగా ఉండటం ముఖ్యం.... ఆమె అతన్ని ప్రేమించలేదని చెప్పింది కదా! కేవలం సెక్యూరిటీ కోసం మాత్రమే ఆమె అతనితో కొంతకాలం కలిసి జీవించి ఉంటుంది. అంతేగానీ అతన్ని ప్రేమించలేదు. ఆమె తనను తప్ప మరెవర్నీ

ప్రేమించలేదు... తను కూడా ఆమెను తప్ప మరెవర్నీ ప్రేమించలేదు.. ఆమె తనకుకావాలి. ఆమె కోసం 16 నెలలు ఎదురుచూశాడు... క్షణమొక యుగంగా ఎదురుచూశాడు.... ఎన్ని యుగాలు గడిచిపోయాయో లెక్కలేదు..... ఆమె అసలు రాదనుకున్నాడు.... తనకూ అమెకు మధ్య యేర్పడిన అగాధాన్ని పూరించలేననుకున్నాడు...అమె ప్రేమకు తను యోగ్యుడు కాదనుకున్నాడు.... అలాంటి ఆమె తనను వెదుక్కుంటూ వస్తే కాదంటావా? ఆమె శరీరం మలినమై పోయిందనుకోవడంలో ఎంత ఈర్ష్య ఉందో ఊహించావా? ఎంత పురుషాధిక్యభావం ఉందో గమనించావా?

అమెనొక వస్తువుగా నీ వస్తువుగా లెక్కించే పురుష మనస్తత్వం నీలో ద్యోతకం కావడం లేదూ? ఆమె నీ వస్తువు ... నీ ప్రాపర్టీ !కాబట్టి అమెను ఎవ్వరూ తాకకూడదు. ఎంత స్వార్థం! ఎంత సంకుచితం! అమె తన జీవితంలోకి ప్రవేశించక ముందు తనూ తిరగలేదూ?... ఆ రోజుల్లో తనెంత మంది స్త్రీలతో తిరిగాడో మరిచిపోయాడా? ఎంత మందితో నీ శరీరాన్ని పెనవేశావో మరిచిపోయావా? నీ శరీరం కూడా మలినమై పోయినట్టే కదా! ఓ భౌతిక అవసరాన్ని తీర్చుకోవడానికి తనూ కొందరు స్త్రీలతో కలిసాడు.... కలిసి విడిపోయిన మరుక్షణంలోనే వాళ్ళను మరిచిపోయాడు- కాని సారిక? సారికను అలా మరిచిపోగలడా? లేదు ...లేదు... సారికను మరిచిపోలేడు... తన శరీరంలోని కోట్ల కోట్ల అణువుల్లో సంపూర్ణంగా లీనమైపోయిన సారికను మరిచిపోలేడు... ఆమె శరీరం మలినం కాలేదు... తన మనస్సు మలినమైపోయింది.... ఆ మలినాన్ని వదిలించుకుంటే తప్ప తనకి విముక్తి లేదు... తన మనస్సుకు పట్టిన ఈ మురికిని వదిలించుకోవడానికి తనతో తను యుద్ధం చెయ్యాలి. ఆ యుద్ధంలో తను గెలవాలి.

" అబ్బ ! ఇప్పుడు చాలా హాయిగా వుంది" అంటూ బాత్రూమ్‌లోంచి సారిక వచ్చేసింది. టవల్‌తో కురుల్ని తుడుచుకుంటూ. "ప్రతిరోజూ స్నానం చేయడం ఓ గొప్ప అనుభవం. గడిచిన 24 గంటల్లో శరీరానికి పట్టిన మురికినంతా వదిలించుకోవడం ఎంత గొప్ప అనుభవం!... ఎంత గొప్ప అనుభూతి! ప్రతిరోజు మనల్ని మనం ఇలా ప్రక్షాళనం చేసుకోకపోతే మన మనస్సును, శరీరాన్ని శుభ్రంగా వుంచుకోలేం..." అంటోంది సారిక. ఆమె తనను గూర్చే అలా అంటోందనిపించిందతనికి.

"అవును... శరీరానికి పట్టిన మురికిని స్నానం చేసి వదిలించుకోవచ్చు - కానీ మనస్సుకు పట్టిన మురికిని వదిలించుకోవాలంటే మనతో మనం యుద్ధంచేయాలి."

" ఇప్పుడు నువ్వు ఆ పనే చేస్తున్నట్టున్నావు?"

అతడు ఉలిక్కిపడ్డాడు

" అవును .... నా అంతరాంతరాల్లో జరుగుతున్న యుద్ధాన్ని నువ్వెలా చూడగలిగావు?"

" నిన్ను చూస్తేనే తెలుస్తున్నది... స్టేట్స్‌లో నీ ఫ్రెండ్ సుమంత్ నన్ను కలిశాడు - అతడు నీకేం చెప్పాడో నేనూహించగలను"

"యేం చెప్పాడనుకుంటున్నావు?"

"నేను ఇంకెవరినో ప్రేమించానని.... అతనితో ఉంటున్నానని.... నేను నా శరీరాన్నీ, మనసును అతనికర్పించానని... కాబట్టి నువ్వామె మీద ఇక ఆశలు వదులుకోమని చెప్పుంటాడు! అది నిజమని నువ్వు నమ్ముతున్నావా?"

"అది నిజమైనా అబద్ధమైనా... ఐడోంట్ కేర్...?" అన్నాడతడు చాలా గంభీరంగా.

"ఈ మాట నీ హృదయంలోంచే వస్తోందా?"

"హృదయంలోంచే వస్తోంది. హృదయంలోంచి రప్పించడానికే నాతో నేను యుద్ధం చేశాను"

"యుద్ధంలో ఎవరు గెల్చారో?"

" నువ్వే గెల్చావు... పోనీ మరోలా చెప్పనా? నీకోసం యుద్ధం చేస్తున్న నేను గెల్చాను...."

"నీతో నువ్వు గానీ, మరెవరితోగానీ నువ్వు యుద్ధం చెయ్యాల్సిన అవసరం లేదు"

"అవును ...... ఎందుకంటే ఐలవ్‌యూ సారికా! ఐ లవ్ యూ, విత్ ఆల్ మై హార్ట్ అండ్ సోల్ !" అన్నాడతడు ఆమెకు దగ్గరిగా వెళ్తూ.

" ఐటూ లవ్ యూ వివేక్! నువ్వు నన్ను నీ ప్రైవేట్ పావర్టీగా చూడనంతకాలం నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను. నిన్ను నేను పెళ్ళి కూడా చేసుకుంటాను. కానీ ఆ పెళ్ళిని నూరేళ్ళ పంట అనుకోవద్దు. నాకు నీ మీద, నీకు నా మీద ఈ ప్రేమ ఇలాగే వున్నంతకాలం మనం కలిసేవుంటాం... మనలో

అనివార్యంగా కొన్ని మార్పులు రావచ్చు... కాని విడిపోవల్సినంతగా మనలో మార్పురానంతకాలం మనం ఎంతకాలమైనా కలిసుండొచ్చు.... పెళ్ళి అనే వ్యవస్థను నేను గౌరవిస్తాను. కానీ ఈ పెళ్ళి నీకు నాకు నరకంగా మారినప్పుడు....."

"ఇక చెప్పొద్దు.... నరకంగా మారినప్పుడు జరిగేదేమిటో నేనూహించుకోగలను" అన్నాడతడు ఆమెకు దగ్గరగా వెళ్తూ

" థాంక్స్" అందామె అతనికి హత్తుకుపోతూ-

" నువ్వు నా సుజితవు" అన్నాడతడు ఆమె పెదవుల కోసం వెతుకుతూ.

" కొత్తపేరా?"

" అవును .... సుజిత అంటే గెల్చుకోబడింది అని అర్థం - నిన్ను నేను గెల్చుకున్నాను"

"ఈజిట్? నిన్నే నేను గెల్చుకున్నానేమో!"

" అయితే నేను సుజితున్ని"

ఇద్దరూ ఒకరి హృదయాల్లో ఒకరు ఐక్యమైపోయారు.

– 'స్వాతి' వారపత్రిక, ***23-9-2005***

కథా నిలయం
శ్రీకాకుళం